

మాతృసేవకు.. మేడా నీరాజనం

• కన్నతల్లి సేవలో మాజీ సైనికుడు • అమ్మను ప్రేమించే బిడ్డలకు సత్కారం



ఈ మార్చిలో జరిగిన కార్యక్రమంలో మాతృమూర్తి సేవా పురస్కారాలు అందజేస్తున్న మస్తాన్‌రెడ్డి

సీతంపేట: అంతులేని ప్రేమానురాగాలకు, ఆప్యాయతకు మారు పేరు అమ్మ. అమ్మ అంటే ఓ అనుభూతి, ఓ అనుబంధం, ఓ అనురాగం. అమ్మ గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. అలాంటిది ఉద్యోగాల పేరుతోనో, ఇతర కారణాలతోనో కన్నవారిని భారంగా భావిస్తూ వృద్ధాశ్రమాలకు పంపుతున్న ఈ రోజుల్లో.. కన్నతల్లిని కంటికి రెప్పలా కాపాడుకునే ఆదర్శ సంతానాన్ని గుర్తించి గౌరవిస్తోంది మేడా బుజ్జమ్మ చారిటబుల్ ట్రస్ట్. భర్తను కోల్పోయి ఒంటరైన తల్లికి అండగా నిలుస్తూ, ఆమె ఆలనాపాలనా చూస్తున్న కొడుకులను, కూతుళ్లను వెతికి మరీ 'మాతృమూర్తి పురస్కారం'తో సత్కరిస్తోంది. తద్వారా సమాజంలో మాతృప్రేమ గొప్పదనాన్ని చాటి చెబుతూ ఎందరికో స్ఫూర్తినిస్తోంది.

మాజీ సైనికుడి మహోన్నత సంకల్పం

భారత సైన్యంలో సుబేదార్ మేజర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన మేడా మస్తాన్‌రెడ్డి ఈ గొప్ప కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నెల్లూరు జిల్లా అల్లూరిలో జన్మించిన మేడా మస్తాన్‌రెడ్డి మూడు దశాబ్దాలకు పైగా భరతమాతకు సేవలందించారు. 1972లో ఆర్మీలో సిపాయిగా చేరిన ఆయన 2003లో సుబేదార్ అయ్యారు. ఆర్మీలో ఉండగానే డిగ్రీ పూర్తి చేశారు. ఉద్యోగ విరమణ అనంతరం విశాఖలో స్థిరపడి.. సామాజిక, సాహిత్య సేవపై దృష్టి సారించారు. తన తల్లి మేడా బుజ్జమ్మ పేరు మీద 2017లో ఈ చారిటబుల్ ట్రస్ట్‌ను స్థాపించారు. ఈ ట్రస్ట్ ద్వారా ఇప్పటివరకు 70 మంది ఆదర్శ మాతృమూర్తి పురస్కారాలు అందుకున్నారు. 'ఈ రోజుల్లో చాలామంది పిల్లలు.. తల్లిదండ్రులు బతికుండగానే వారిని పట్టించుకోవడం లేదు. అలాంటి వారిలో మార్పు తీసుకురావాలనేదే నా తపన. అమ్మను ప్రేమగా చూసుకోవడం ప్రతి బిడ్డ ధర్మమని గుర్తుచేయడానికే ఈ పురస్కారాలు అందిస్తున్నాను.' అని మస్తాన్‌రెడ్డి తన ఆశయాన్ని వివరించారు. ఈ మహోన్నత కార్యక్రమానికి క్రియేటివ్ కామెడీ క్లబ్ అధ్యక్షుడు వేముల భాస్కరాచారి, కొంతమంది మిత్రులు సాయం అందిస్తున్నారని తెలిపారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి మస్తాన్‌రెడ్డి

మస్తాన్‌రెడ్డి సైన్యంలో పనిచేస్తూనే సాహిత్యంపై మక్కువ పెంచుకున్నారు. పదవీ విరమణ తర్వాత తనలోని రచయితకు పదును పెట్టారు. ఆయన రాసిన 'కృష్ణపక్షం కథలు' పాఠకుల మన్ననలు పొందాయి. కథలు, వ్యాసాలు, పేరడీ గీతాలు, స్కిట్స్‌తో ఆయన సాహిత్య లోకంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆయన సేవ కేవలం పురస్కారాలకే పరిమితం కాలేదు. క్రియేటివ్ కామెడీ క్లబ్ వ్యవస్థాపకుడిగా ప్రతి నెలా మూడో ఆదివారం హాస్య నాటికల ప్రదర్శనతో ప్రజలకు మానసిక ఉల్లాసాన్ని పంచుతున్నారు. అన్నపూర్ణ నిత్య అన్నదాన ట్రస్ట్ పర్యవేక్షకుడిగా మానసిక ఆసుపత్రికి వచ్చే రోగుల సహాయకులకు నిత్యం అన్నదానం చేస్తున్నారు. తగరపువలసలోని నవ చైతన్య కళా నాట్య సంక్షేమ సంఘం సలహాదారుడిగా కళలకు తన వంతు ప్రోత్సాహం అందిస్తున్నారు. ఒకప్పుడు దేశ సరిహద్దుల్లో భరత మాతకు సేవ చేసిన సైనికుడు.. ఇప్పుడు సమాజంలో కన్నతల్లుల గౌరవాన్ని కాపాడేందుకు నడుం బిగించడం అభినందనీయం.

మొదటి పురస్కారం అందుకున్నాను



మేడా బుజ్జమ్మ ట్రస్ట్ నుంచి మాతృమూర్తి మొట్టమొదటి పురస్కారాన్ని నేను, నా భార్య కలిసి అందుకున్నాం. చాలా గర్వంగా అనిపించింది. మా అమ్మ 93 ఏళ్లు బతికారు. గతేడాది చనిపోయారు. నేను అమ్మను కంటికి రెప్పలా చూసుకున్నాను. తల్లిదండ్రులను చూడటం పిల్లలందరి కర్తవ్యం. దురదృష్టవశాత్తు కొందరు కుమారులు పట్టించుకోని కారణంగా కొంతమంది తల్లులు ఒంటరిగా మిగిలిపోయి వృద్ధాశ్రమాలను ఆశ్రయిస్తున్నారు. మరికొంత మంది ఆస్తులు తీసుకుని తల్లులను వెళ్లగొడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ పురస్కారం అందుకోవడం నాకు మరింత ఆనందాన్నిచ్చింది. భవిష్యత్ ఈ ట్రస్ట్ మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలి.

– సుసర్ల సర్వేశ్వర శాస్త్రి, మాతృమూర్తి పురస్కార గ్రహీత

తల్లిదండ్రుల విలువను చాటి చెబుతున్నారు



మేడా బుజ్జమ్మ చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు చాలా గొప్పవి. సమాజంలో మనిషి ఎలా బతకాలి. తల్లిదండ్రులను ఎలా చూసుకోవాలో ఈ ట్రస్ట్ ద్వారా యువతరానికి ప్రేరణ కలిగిస్తున్నారు. ఈ ఏడాది మార్చిలో మాతృమూర్తి పురస్కారం అందుకున్నాను. 2017లో నాన్న చనిపోయిన తర్వాత అమ్మకు ఏ లోటూ లేకుండా కంటికి రెప్పలా చూసుకుంటున్నాను. ఇందులో నా భార్య సహకారం కూడా మరువలేనిది. కార్గిల్ యుద్ధంలో కాలికి గాయమైనప్పటికీ మస్తాన్‌రెడ్డి తన బృందంతో ఇలాంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయం. నేటి యువతరానికి తల్లిదండ్రుల విలువ, వారి పట్ల బాధ్యత తెలిసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

– కొచ్చర్లకోట లక్ష్మీనరసింహం, స్టీల్‌ప్లాంట్ అధికారి

అమ్మను మించిన ఆస్తి లేదు



మాది వ్యవసాయ కుటుంబం. కష్టపడే తత్వాన్ని, ప్రజలకు సేవ చేయాలనే స్ఫూర్తిని మా అమ్మ నాకు నేర్పింది. ఎంత సేవ చేసినా తీర్చలేనిది తల్లి రుణం. సమాజంలో ఒక స్థాయికి చేరుకున్న కొందరు తమ తల్లులను వృద్ధాశ్రమాలకు పంపిస్తున్నారు. అలా చేయవద్దని మా అమ్మ ఎప్పుడూ చెప్పేది. పిల్లలే ప్రపంచంగా బతికే తల్లిని వృద్ధాప్యంలో కంటికి రెప్పలా చూసుకోవాలి. 2017లో మా అమ్మ మరణానంతరం నేను ఒక ట్రస్ట్ స్థాపించి, ఏటా కొంత మందిని మాతృమూర్తి సేవా పురస్కారాలతో సత్కరిస్తున్నాను. ఇది మరికొంత మందికి స్ఫూర్తినిస్తుందని ఆశిస్తున్నాను.

– మేడా మస్తాన్‌రెడ్డి, ట్రస్ట్ వ్యవస్థాపకుడు

క్లుప్తంగా

పౌర్ణమి పూజలకు ఏర్పాట్లు



మురళీనగర్: మురళీనగర్ రామాలయ ప్రాంగణంలోని షిర్డీసాయి ఆలయంలో ఈ నెల 10వ గురుపౌర్ణమి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ నిర్వహణ కమిటీ కార్యదర్శి ఎస్.వరప్రసాద్ తెలిపారు. ఆరోజు ఉదయం సాయినాథుడికి ప్రత్యేక పూజలు చేస్తారు. సాయంత్రం 6 గంటల నుంచి ఏకాహం నిర్వహిస్తారు. ఈ మేరకు శ్రీసాయి జయ జయ సాయి నామాన్ని 12 గంటల పాటు పఠిస్తామన్నారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని వేడుకలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పిల్లల్లో స్వతంత్ర ఆలోచనలు ముఖ్యం

• ఐఆర్‌ఎస్ అధికారి రవికిరణ్

సీతంపేట: జీతం కోసమే కాకుండా జీవితంలో అన్ని పరిస్థితులను ఎదుర్కొనేలా పిల్లలను తయారు చేయాలని ఐఆర్‌ఎస్ అధికారి ఈదర రవికిరణ్ అన్నారు. బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం హైవే సమీపంలోని కస్టమ్స్ జీఎస్టీ నార్కోటిక్స్ జాతీయ అకాడమీ(నాసిన్)లో శనివారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో ప్రశ్నించేతత్వం పెరగాలని, నేటి ఏఐ కాలంలో బట్టీ పట్టే చదువులకు చోటు లేదన్నారు. పిల్లల్లో స్వతంత్రంగా ఆలోచించే మనస్తత్వం, కమ్యూనికేషన్ స్కిల్స్ పెరిగేలా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. రోజూ పిల్లలు కొద్దిసేపు అయినా ఆంగ్ల దినపత్రికలు చదవాలని సూచించారు. ఇష్టమైన హాబీల్లో పిల్లలను ప్రోత్సహిస్తే వారు మత్తు పదార్థాలు, ఇతర వ్యసనాల వైపునకు మళ్లకుండా ఉంటారన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ విషయంలో ప్రాధాన్యమివ్వాలన్నారు. బాలవికాస్ ఫౌండేషన్ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామని తెలిపారు.

శ్రీనగర్ రోడ్డులో మ్యాన్‌హోల్ లీకేజీ



శ్రీనగర్ రోడ్‌లో లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్

సీతంపేట: జీవీఎంసీ 27వ వార్డు పరిధి శ్రీనగర్ రోడ్డులో ఉన్న కూరగాయల బజారు సమీపంలో యూజీడీ మ్యాన్‌హోల్ లీకై, తీవ్ర సమస్యలను సృష్టిస్తోంది. కొన్ని రోజులుగా ఈ లీకేజీ కారణంగా మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో నివాసితులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు రోడ్డుపై నిరంతరం ప్రవహించడం వల్ల దోమలు, ఇతర కీటకాలు వృద్ధి చెందుతున్నాయి. ఇది డెంగ్యూ, మలేరియా వంటి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదాన్ని పెంచుతుంది. కూరగాయల బజారుకు నిత్యం వందలాది మంది వినియోగదారులు వస్తుంటారు. అయితే మురుగునీటిని దాటుకొని లోపలికి వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. తద్వారా వ్యాపారం గణనీయంగా తగ్గిపోయిందని దుకాణదారులు వాపోతున్నారు. జీవీఎంసీ యూజీడీ విభాగం అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పెళ్లివారింట్లో చోరీ

పెదగంట్యాడ: మండలంలోని సీతానగరంలో ఓ పెళ్లివారింట్లో చోరీ జరిగింది. సీతానగరంలో నంబారు శ్రీనివాసరావు కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 5న రాత్రి అతని సోదరుడు వెంకటేష్ వివాహాన్ని అతని ఇంటి సమీపంలో ఉన్న పాఠశాల మైదానంలో నిర్వహించారు. పెళ్లి సందర్భంగా ఇంటికి తాళాలు వేయకుండా తలుపులు దగ్గరగా వేసి ఉంచారు. ఇదే అదునుగా దొంగ నక్లెస్, నాలుగు జతలు చెవిదిద్దులు మొత్తం మూడు తులాల బంగారం చోరీ చేశాడు. పెళ్లి వేడుక ముగించుకొని ఇంటికి వెళ్లి చూస్తే బంగారం, సెల్‌ఫోన్లు కనిపించలేదు. దీంతో ఆయన న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కేజీహెచ్‌లో పోలీస్ అవుట్ పోస్ట్ ప్రారంభం

అల్లిపురం: కేజీహెచ్‌లో నూతన ఫార్మసీ కౌంటర్, టెస్లా సెంటర్ వద్ద రోగుల కోసం నిర్మించిన నిరీక్షణ షెడ్లు, అలాగే మార్చురీ ఆవరణలో నిర్మించిన పోలీస్ అవుట్ పోస్ట్‌ను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీస్ అవుట్ పోస్ట్ భవనం లేకపోవడం వల్ల ప్రజలు, పోలీస్ సిబ్బంది చాలా ఇబ్బంది పడేవారన్నారు. కేజీహెచ్ పరిసరాల్లో ఐదు కిలోమీటర్ల పరిధిలో 24/7 డ్రోన్ల నిఘా ఉంటుందని, తద్వారా కేజీహెచ్‌లో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి సురక్షితమైన వాతావరణాన్ని కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

రైల్వే న్యూ కాలనీలో కార్డన్ సెర్చ్





రైల్వే న్యూ కాలనీ ప్రాంతంలో వాహనాలు, ఇళ్లలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

సీతంపేట: ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రైల్వే న్యూకాలనీ ప్రాంతంలో శనివారం సాయంత్రం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈస్ట్ సబ్ డివిజన్ సిబ్బంది సాయంతో సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొని తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వాహనాలు, వ్యక్తులను, ఇళ్లను అణువణువూ పరిశీలించారు. దుకాణాల్లో నిషేధిత వస్తువులు విక్రయిస్తున్నారా అని ఆరా తీశారు. అనుమానిత వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

కనకమహాలక్ష్మికి తులసిపూజ



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు భక్తులు పాల్గొన్నారు. అలాగే అమ్మవారికి నిర్వహించిన త్రికాల పంచామృతాభిషేక సేవలో ఉభయదాతలు భాగమయ్యారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొనే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సుప్రభాత సేవను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల నిర్వహించి, సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. ఉదయం 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన సమర్పించారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా 300 మంది భక్తులకు అన్న సమారాధన చేశారు. సాయంత్రం 6.30 గంటలకు విశేష హారతి సమర్పణలో భాగంగా నక్షత్ర హారతి, కర్పూర హారతి, కూష్మాండ హారతి, కుంభ హారతి సమర్పించారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వైభవ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఈ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్



మసీద్ ఈ క్యూబాలో నమాజ్ చేస్తున్న ముస్లింలు



ముస్లిం తాటిచెట్లపాలెంలో నమాజు చేస్తున్న ముస్లింలు



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

సీతంపేట: తాటిచెట్లపాలెం, చిన్నూరు మసీదులు, ఈద్గాలలో శనివారం బక్రీద్ పండగను ఘనంగా నిర్వహించారు. ముస్లిం తాటిచెట్లపాలెంలో మసీద్-ఏ-క్యూబా కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని 'ఈద్ ముబారక్' అంటూ బక్రీద్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా ఈదుల్ అజహా ప్రత్యేక నమాజ్ ఆచరించారు. మసీదు పెద్దల ఆధ్వర్యంలో జరిగిన ఈద్ నమాజ్‌లో పెద్ద సంఖ్యలో ముస్లిం యువత సంప్రదాయ వస్త్రధారణలో సందడి చేసింది.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు పరిధి జాకీర్ హుస్సేన్‌నగర్‌లోని మస్జిద్-ఎ-అల్ ఖదీర్, మర్రిపాలెం మస్జిద్-ఎ-అల్ ఫతా ఆధ్వర్యంలో ఈద్ ఉల్ అజహా(బక్రీద్) శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా ముస్లింలు మసీదులోని ఫజర్ నమాజ్ ఆచరించారు. అనంతరం మర్రిపాలెం పరిసర ప్రాంతాల్లో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆ తర్వాత ఈద్గా వద్దకు చేరుకొని ఈద్ నమాజ్ ఆచరించారు. మత గురువు హఫీజ్ హఫ్రోజ్ తక్రీర్ ఇచ్చారు. ఈద్ నమాజ్ పూర్తి చేసుకున్న ముస్లింలు సమీపంలోని బరియల్ గ్రౌండ్ వద్దకు చేరుకుని, తమ పూర్వీకుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కనకమాంబ పండగకు వేళాయె

• నేటి నుంచి వార్షిక మహోత్సవం
• రేపు తొలేళ్లు, 10న అనుపోత్సవం
• ఇసుకతోట ఆలయంలో ఏర్పాట్లు పూర్తి



అలంకరణలో అమ్మవారు



ఇసుకతోట కనకమాంబ అమ్మవారి ఆలయం

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలో కొలువైన శ్రీకనకమాంబ, నెల్లి పోలమాంబ, ఎర్నిమాంబ అమ్మవార్ల పండగకు వేళాయింది. ఆదివారం నుంచి వార్షిక మహోత్సవం ఘనంగా ప్రారంభమవుతుందని శ్రీకృష్ణా ఉమా మహేశ్వర సాయిదుర్గా యాదవ సేవా సంక్షేమ సంఘం ప్రతినిధులు, ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు గొలగాని అప్పారావ తెలిపారు. ఈ నెల 10 వరకు వేడుకలు జరుగుతాయన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పండగ మూడు రోజుల పాటు సాయంత్రం వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ నెల 8న చాటింపు, కలశ పూజ ప్రారంభం, 9న తొలేళ్ల సంబరం, అమ్మవార్లకు కుంకుమ పూజలు, లలిత సహస్ర పారాయణం జరుగుతాయని వెల్లడించారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా రాత్రికి బుర్రకథ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. 10వ తేదీ ఉదయం 4 గంటల నుంచి కనకమాంబకు పంచామృతాభిషేకాలు, కుంకుమార్చన, సాయంత్రం 4 గంటలకు అమ్మవారి అనుపు ఉత్సవం ఘనంగా నిర్వహించనున్నామని తెలిపారు.

కల్యాణ శోభ



ఘనంగా సీతారామచంద్రస్వామి కల్యాణం


డాబాగార్డెన్స్: జ్యేష్ఠ శుద్ధ ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి వార్షిక దివ్య కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. ఉదయం 8 గంటలకు నిత్య హోమాలు, వైనతేయ ప్రతిష్ఠ, ధ్వజారోహణం నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు ప్రారంభమైన స్వామి దివ్య తిరు కల్యాణోత్సవానికి నగరం నుంచే గాక సుదూర ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చారు. వేద మంత్రాలు, సన్నాయి వాయిద్యాల మధ్య స్వామి కల్యాణం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపారు. ఆలయ ఈవో టి. రాజగోపాలరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, సిబ్బంది, ఫణిహారం నరసింహమూర్తి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటలకు నిత్య కార్యక్రమాలు, విశేష పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు నిత్యపూజలు, హోమాలు జరపనున్నారు.

కనకమహాలక్ష్మి దత్తత దేవాలయమైన అంబికాబాగ్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయం వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామికి విశేష ఆరాధన, నిత్యహోమాలు, బలిహరణ నిర్వహించారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు స్వామి కల్యాణోత్సవం వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య శాస్త్రోక్తంగా, వైఖానస సంప్రదాయ రీతిన అత్యంత వైభవంగా నిర్వహించారు.

సింహాచలేశునికి స్వర్ణ తులసీ దళార్చన

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఉదయం 7గంటల నుంచి స్వర్ణ తులసీ దళార్చనను ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చి, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. 108 స్వర్ణ తులసీదళాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలి



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావమ్మ

అల్లిపురం: ఏడాది గడుస్తున్నా అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించలేదని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సుబ్బారావమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోమవారం దేశవ్యాప్తంగా జరిగే అఖిలభారత సమ్మెలో అంగన్‌వాడీ కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. జగదాంబ వద్ద సీఐటీయూ యూనియన్ కార్యాలయంలో శనివారం జరిగిన అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమావేశంలో ఆమె మాట్లాడారు. గతంలో 42 రోజుల సమ్మె సందర్భంగా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అనేక హామీలను ఆమె గుర్తు చేశారు. సమ్మె కాలంలో కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే అంగన్‌వాడీ కార్యకర్తల జీతాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అర్బన్ ప్రాజెక్టు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షురాలిగా ఆర్. ఈశ్వరమ్మ, అధ్యక్షురాలిగా శోభారాణి, ప్రధాన కార్యదర్శిగా ఎస్. తులసి, కోశాధికారిగా ఇందిర, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అన్నపూర్ణ, ఉపాధ్యక్షురాలిగా విజయలక్ష్మి, జాయింట్ సెక్రటరీలుగా ఎర్రయమ్మ, పార్వతి ఎన్నికయ్యారు. శివలక్ష్మి, రాధ, నజ్మా, వల్లి రాణి, పైడికొండ, కుమారి, మహాలక్ష్మిలను సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దేవి, బృందా, వెంకటలక్ష్మి, పద్మ, పి. మణి తదితరులు పాల్గొన్నారు.

బయోడైవర్సిటీ పార్క్‌ను సందర్శించిన విద్యార్థులు



బయోడైవర్సిటీ పార్క్‌లో విద్యార్థుల సందడి

బీచ్‌రోడ్డు: నగరంలోని ఒక ప్రైవేట్ విద్యా సంస్థకు చెందిన విద్యార్థులు శనివారం పెదవాల్తేరులోని బయోడైవర్సిటీ పార్క్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారికి పార్క్ పర్యవేక్షకుడు రామామూర్తి వివిధ రకాల మొక్కల విశేషాలను తెలియజేశారు. మొక్కల శాస్త్రీయ నామాలు, ఉపయోగాలు, అవి పెరిగే వాతావరణం గురించి వివరించారు. విద్యార్థుల మొక్కల విశేషాలను తెలుసుకుని పార్క్‌లో సందడి చేశారు.